సాక్షి
తూర్పుగోదావరి
శనివారం । 6 । జూలై । 2024



అప్పుడే.. మీ సొమ్ము భద్రం


అధిక వడ్డీలకు ఆశపడి ప్రైవేటు సంస్థల్లో తమ కష్టార్జితాన్ని జనం దాచుకోవడం తగదని నిపుణులు సూచిస్తున్నారు. ప్రభుత్వ రంగం సంస్థల్లోనే భద్రమని చెబుతున్నారు. - 8లో



వెల్లలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో గురువారం రాత్రి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. - 8లో

డెల్టాకు 11,920 క్యూసెక్కులు



ధవళేశ్వరం: గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 11,920 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 3,000, మధ్య డెల్టాకు 2,420, పశ్చిమ డెల్టాకు 6,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 10.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

14.2 మి.మీటర్ల వర్షపాతం

కొవ్వూరు: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఉదయం ఎనిమిదిన్నర గంటలకు గడిచిన ఇరవై నాలుగు గంటల వ్యవధిలో సరాసరి 14.2 మి.మీటర్లు వర్షపాతం నమోదైంది. గోపాలపురంలో గరిష్టంగా 33.8, అనపర్తి 13.6, కడియం 10.8, రాజమహేంద్రవరం రూరల్ 12.6, రాజమహేంద్రవరం అర్బన్ 12.4, రాజానగరం 10.6, రంగంపేట 16.8, చాగల్లులో 18.4, దేవరపల్లి, కొవ్వూరు, నిడదవోలు మండలాల్లో 18.2, నల్లజర్లలో 33.6, పెరవలి 14.8, తాళ్లపూడి 12.6, ఉండ్రాజవరం 13.8 మి.మీటర్ల చొప్పున వర్షం కురిసింది. జిల్లాలో మిగిలిన మండలాల్లో చెదురుమదురుగా జల్లులు పడ్డాయి.

ప్రత్యేకాలంకరణలో మరిడమ్మ



పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారిని ప్రత్యేకాలంకరణ చేశారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, కార్యనిర్వహణాధికారి సీహెచ్ రామ్మోహనరావుల సమక్షంలో వేద పండితులు అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేయగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ.2,00,232 విరాళం



దాత రామసుధాకర్‌కు అన్నదానం బాండ్ అందజేస్తున్న అధికారులు

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి అన్యం రామసుధాకర్ (కాకినాడ) రూ.2,00,232 విరాళాన్ని శుక్రవారం సమర్పించారు. అన్యం రాములు, సావిత్రమ్మ, కటిరెడ్డి లక్ష్మణరావు, నాగరత్నమ్మ పేర్ల మీద ఏటా అన్నదానం చేయాలని దాత కోరారు. అధికారులు దాతకు అన్నదానం రశీదు అందజేశారు.

తలుపులమ్మకు రూ.35.46 లక్షల ఆదాయం



హుండీల ఆదాయం లెక్కిస్తున్న సిబ్బంది

తుని రూరల్: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానానికి హుండీల ద్వారా రూ.35,46,802 ఆదాయం సమ కూరినట్టు ఇన్‌చార్జి కమిషనర్, కార్యనిర్వహణ అధికారి పెన్మెత్స విశ్వనాథరాజు తెలిపారు. శుక్రవారం కాకినాడ జగన్నాథపురం గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణ అధికారి వడ్డాది సత్యనారాయణ, సిరిపురం గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణ అధికారి ఎం.సూర్యమణి పర్యవేక్షణలో హుండీలు తెరిచినట్టు ఆయన తెలిపా రు. 29 రోజుల్లో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన నాణేలు రూ.1,07,845, నోట్లు రూ.34,38,957 వెరసి మొత్తం రూ.35,46,802 ఆదాయం సమకూరిందన్నారు. బంగారం 87 గ్రాముల 600 మిల్లీ గ్రాములు, వెండి మూడు కేజీల 260 గ్రాములు లభించిందన్నారు. లెక్కింపులో దేవస్థానం ఉద్యోగులు, శ్రీవారి సేవకులు పాల్గొన్నట్టు ఆయన తెలిపారు.

8న జాబ్‌మేళా

కాకినాడ సిటీ: వికాస ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన వికాస కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె.లచ్చారావు శుక్రవారం వివరించారు. ఈ జాబ్‌మేళాలో బ్రాండ్ బుజ్ కంపెనీలో డిజిటల్ మార్కెటింగ్ మేనేజర్, సోషల్ మీడియా మార్కెటింగ్ మేనేజర్, పట్టాభి ఆగ్రో ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో జీఈటీ సూపర్‌వైజర్, శ్రీ కాశేశ్వరి రిఫైనరీ అండ్ ఇండస్ట్రీ ప్రైవేట్ లిమిటెడ్‌లో టెక్నీషియన్, క్యూ.సి, అరబిందో ఫార్మాలో టెక్నీషియన్, కెమిస్ట్, డెక్కన్ కెమికల్స్‌లో ట్రైనీ ప్రొడక్షన్, రాక్‌మెన్ ఇండస్ట్రీస్, డిక్సాన్ అండ్ హోండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లమా, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంఎస్‌సీ బయోటెక్నాలజీ, మైక్రో బయోలజీ ఉత్తీర్ణులైన 35 సంవత్సరాల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. వీరికి నెలకు రూ.12 వేల నుంచి రూ.20 వేల జీతం, ఇన్సెంటివ్స్, భోజనం, వసతి, రవాణా సౌకర్యం ఉద్యోగాలను బట్టి ఉంటుందన్నారు. ఆసక్తిగల వారు కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో హాజరు కావచ్చన్నారు.

చౌకబారు పాలన



ఎండీయూ వాహనాలు

- అటకెక్కనున్న ఇంటింటికీ రేషన్ పంపిణీ
- ఎండీయూలకు మంగళం
- ఒక్కొక్క పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్ర
- మూర్ఖపు ఆలోచన అన్న మంత్రి నాదెండ్ల

సాక్షి ప్రతినిధి, కాకినాడ: నిరుపేదలకు సంతృప్త స్థాయి సంక్షేమాన్ని అందించిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పథకాలను ఒక్కొక్కటీ అటకెక్కించే కుట్రలు జరుగుతున్నాయి. పైసా ఖర్చు లేకుండా రైతులకు అమలు చేస్తోన్న పంటల బీమా స్థానంలో పాత పద్ధతినే కొనసాగిస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. అంటే రైతుల నుంచి ప్రీమియం వసూలు చేయాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్న విషయం స్పష్టమైంది. బాబు ప్రకటన వెలువడిన 24 గంటలు కూడా దాటకుండానే పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ చౌకధరల దుకాణాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీ వట్టి మూర్ఖపు పథకం అని తేల్చేశారు. అంటే ఈ పథకానికి రోజులు దగ్గర పడ్డట్టేనని తేలిపోయింది. పేదల పక్షపాతిగా జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో సంక్షేమ పాలనకు పెద్ద పీట వేశారు. ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకుని ఐదేళ్లు పేదల సంక్షేమాన్ని రాజకీయాలకు అతీతంగా అమలు చేసి చూపారు. ఇటీవలి జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో విపక్ష నేతలు కూటమిగా జత కట్టి అలవికాని హామీలతో ప్రజలను నమ్మించారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే మరిన్ని పథకాలు అందిస్తామంటూ నమ్మబలికారు. అలా వారి వాగ్దానాలను నమ్మిన ప్రజలకు నెల రోజులు కూడా తిరగకుండానే కూటమి ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. ఒక్కొక్క సంక్షేమ పథకాన్ని అటకెక్కించేందుకు ఆరాటపడుతున్నట్టు కనిపిస్తోంది. తాజాగా పౌర సరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ ఇంటింటికీ రేషన్ పథకాన్ని మూర్ఖపు ఆలోచనగా అభివర్ణిస్తూ తుది నిర్ణయం తీసుకుంటామని ప్రకటించడం వెనుక ఆ పథకాన్ని ఎత్తేసే కుట్రకు తెర తీస్తున్నారని సామాన్యులకు సైతం ఇట్టే స్పష్టమైపోతోంది. నేడో, రేపో ఇంటింటికీ రేషన్ అందించే విధానానికి రోజులు దగ్గర పడ్డట్టేనంటున్నారు.

దేశానికి ఆదర్శం.. కూటమికి కంటగింపు

ఇంటింటికీ రేషన్ పంపిణీ దేశంలో అనేక రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటుంటే ఇక్కడి కూటమి ప్రభుత్వానికి మాత్రం మూర్ఖపు పథకంగా కనిపిస్తుండటం విస్మయాన్ని కలిగిస్తోంది. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీ పథకానికి రూపకల్పన చేశారు. మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ) ద్వారా ప్రజా పంపిణీలో నవశకానికి నాంది పలికారు. ఈ పథకం దేశం మొత్తాన్ని ఆకర్షించింది. పేదలకు ప్రభుత్వం నుంచి సేవ, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను కల్పించే లక్ష్యంతో రూపొందిన పథకం గడచిన ఐదేళ్లుగా విజయవంతంగా అమలు చేశారు. కానీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది.

నాడు డీలర్ల వ్యవస్థను కొనసాగిస్తూనే..

పేదలకు దూరాభారం, రేషన్ దుకాణంలో డీలర్ ఉంటే సరకులు.. లేదంటే నిరీక్షణ! ఇవీ పాత పద్ధతిలో ఎదురయ్యేవి. వీటిన్నింటికీ స్వస్తి పలికేందుకు జగన్ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీ కి శ్రీకారం చుట్టింది. 2021 జనవరి 21న వాహనాలను జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఫిబ్రవరి 1న రాష్ట్రంలో 12 పట్టణాల్లో పంపిణీ ప్రారంభమై స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ ముగియడంతో ఫిబ్రవరి 23 నుంచి గ్రామాల్లో పంపిణీ మొదలు పెట్టారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లావ్యాప్తంగా 17,76,345 రేషన్‌కార్డుదారులకు నిత్యావసర సరకులను ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 17 వరకూ ఈ పోస్ యంత్రం ద్వారా జీపీఎస్ ట్రాకింగ్ పద్ధతిలో పంపిణీ చేస్తున్నారు. మొత్తం పంపిణీ కార్యక్రమాన్ని సెంట్రల్

తూర్పుగోదావరి జిల్లా...

రేషన్ పంపిణీ చేసే వాహనాలు :	364
రేషన్‌కార్డులు :	5,74,907
పంపిణీచేసే బియ్యం :	8,400 టన్నులు
రేషన్ దుకాణాలు :	871

కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేయడంతో పకడ్బందీగా పథకం నడుస్తోంది. కొత్త పథకం వచ్చిందని రేషన్ డీలర్ల వ్యవస్థను నిర్వీర్యం చేయకుండా ఎండీయూలకు సరకులను సరఫరా చేసే బాధ్యతలను ఆయా డీలర్లకు అప్పగించారు.

కోవిడ్ సమయంలో...

కోవిడ్ సమయంలో ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీ ఎంతగానో ఉపయోగపడింది. ఆ సమయంలో రేషన్ సరకులే నిరుపేదలకు, మధ్యతరగతి వర్గాలకు కొండంత అండగా నిలిచాయి. పారదర్శకంగా సరకులు పంపిణీ చేసేందుకు లబ్ధిదారుని ఇంటికి వెళ్లి ఎలక్ట్రానిక్ కాటాలోనే సరకులను తూకం వేసి అందజేశారు.

మంత్రి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

పౌర సరఫరాల శాఖా మంత్రి తీరు ఆడలేక మద్దెలఓడె అన్నట్టు ఉంది. ఆర్థిక భారాన్ని లెక్క చేయకుండా పేదల సంక్షేమమే పరమావధిగా జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అమలు చేశారు. ఈ పథకం అమలు చేయడం మూర్ఖపు ఆలోచన అని, వాహనాలు కొనుగోలు చేయడంతో రూ.1,500 కోట్లు నష్టం వాటిల్లిందంటూ మంత్రి నాదెండ్ల చేసిన వ్యాఖ్యలు పేదలపై ఉన్న వ్యతిరేకతను చెప్పకనే చెబుతున్నాయి. ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలంటూ గగ్గోలు పెడుతోన్న మంత్రి నాదెండ్లకు పేదల కష్టాలు కళ్లకు కట్టకపోవడం అన్యాయమంటున్నారు. అధికారంలో ఎవరు ఉన్నా సంక్షేమ పథకాలను అమలు చేయాల్సిందేనన్న పకడ్బందీ విధానాన్ని జగన్ తీసుకువచ్చారు. అయినా మంచి కళ్లముందు కనబడకూడదనే దుర్బుద్ధితో చంద్రబాబు ప్రభుత్వం ఇంటింటికీ రేషన్‌ను ఎత్తేసే కుట్రలు చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఒప్పందం మాటేమిటి?

ఇంటింటికీ రేషన్ సరకుల పంపిణీలో భాగంగా ఎండీయూ నిర్వాహకులకు 2027 వరకూ ఒప్పందం ఉంది. వాహనాల వాయిదాలు సైతం అప్పటి వరకూ చెల్లించాల్సి ఉంది. రూ.5.80 లక్షల విలువైన ఎండీయు వాహనాన్ని ప్రభుత్వం ఏర్పాటుచేసి నిరుద్యోగులకు ఉపాధి అవకాశాన్ని కల్పించింది. వాహన వ్యయంలో 10శాతం లబ్ధిదారులు చెల్లించగా, మిగిలినది ప్రభుత్వం చెల్లించింది. లబ్ధిదారుడు నెలకు రూ.3వేలు చెల్లిస్తుండగా, మిగిలిన రూ.8వేలు ప్రభుత్వం బ్యాంకులకు చెల్లిస్తోంది. పథకాన్ని రద్దు చేస్తే ఈ ఒప్పందాన్ని ఏమి చేస్తారని నిర్వాహకులు ప్రశ్నిస్తున్నారు. అవసరమైతే న్యాయ పోరాటానికి సిద్ధపడాలనే ఆలోచనతో ఉన్నారు.

సిబ్బందిని కొనసాగించాలి



ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1,074 మంది ఎండీయూ వాహనాల ద్వారా ప్రజలకు రేషన్ అందజేస్తున్నారు. ఈ విధానంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ వాహనాల ద్వారా పనిచేస్తున్న సిబ్బందిని కొనసాగించాలి. సిబ్బందితో పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– సిద్దాంతపు రవికుమార్, ఎండీయూ ఆపరేటర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు

ఇంటింటికీ వచ్చి సరకులు ఇవ్వాలి



ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ పంపిణీ చేయాలి. గత ప్రభుత్వం అమలు చేసిన విధానాన్ని కొనసాగిస్తే మాలాంటి వృద్ధులకు ఎంతో మేలుగా ఉంటుంది. రేషన్ డిపోలకు వెళ్లి సరకులు మోసుకుని తెచ్చుకోవాలంటే ఎంతో ఇబ్బందులు ఎదుర్కోవాలి.

– గంగాయమ్మ, బసివిరెడ్డిపేట, నిడదవోలు

తాగునీటి సరఫరాపై దృష్టి

- అధికారులకు కలెక్టర్ ప్రశాంతి సూచన
- సీతానగరం పీహెచ్‌సీలో ఆరోగ్య సేవలపై ఆరా

సీతానగరం: మండలంలో శానిటేషన్, రక్షిత తాగునీటి సరఫరాపై సమన్వయ శాఖలు దృష్టి సారించాలని కలెక్టర్ పి. ప్రశాంతి సూచించారు. శుక్రవారం సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిని కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. తొలుత గ్రామ సచివాలయంలో వివిధ శాఖాధికారులతో సమీక్ష నిర్వహించి, డయేరియా కేసులు పెరగకుండా ఏ చర్యలు తీసుకున్నారని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. మరొక్క డయేరియా కేసు పెరిగినా సంబంధిత అధికారులను ఉపేక్షించేది లేదని, చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న దృష్ట్యా ప్రజలు తప్పకుండా కాచి చల్లార్చిన నీటిని, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. సీతానగరం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. వైద్య సేవలు అందించడంతో వారి ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని డీఎంహెచ్‌వో కె. వెంకటేశ్వరరావు కలెక్టర్‌కు తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బందితో పాటు పంచాయతీరాజ్, ఐసీటీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ వంటి సమన్వయ శాఖల అధికారులతో కలిసి గ్రామ సచివాలయం - 1 నుంచి గ్రామంలో పారిశుధ్యం పరిశీలిస్తూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు కాలినడకన వెళ్లారు. మార్గం మధ్యలో నీటి నిల్వలు, దుర్గంధం వెదజల్లుతున్న డ్రైనేజీని చూసి అసహనం వ్యక్తం చేశారు. శానిటేషన్, క్లోరినేషన్, ఆరోగ్య సేవలు, వైద్య శిబిరాల కొనసాగింపుపై కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఆర్‌డీఓ చైత్ర వర్షిణి, డీపీఓ డి.రాంబాబు, డీఎల్‌డీఓ వీణాదేవి, డీఎల్‌పీఓ నాగలత, పంచాయతీ అధికారులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



సీతానగరం పీహెచ్‌సీలో రోగులను పరామర్శిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

మహిళలు, రైతుల ఆందోళన

- బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద పెద్ద ఎత్తున నిరసన
- బిజినెస్ కరస్పాండెంట్ చేతివాటంపై కొనసాగుతున్న విచారణ

రాజానగరం: న్యాయం కోసం వారం, పది రోజులుగా బ్యాంకు వద్ద పడిగాపులు కాస్తున్న మహిళలు, రైతులు శుక్రవారం ఆందోళనకు దిగారు. మండలంలోని జి.యర్రంపాలెం బ్యాంక్ ఆఫ్ బరోడాలో బిజినెస్ కరస్పాండెంట్‌గా పనిచేస్తున్న నానిబాబు చేతివాటం చూపి, డ్వాక్రా మహిళలు, రైతుల నుంచి సుమారు రూ.40 లక్షలకు పైబడి స్వాహా చేసిన సంగతి విదితమే. దీనిపై బ్యాంకు పరంగానే కాకుండా డీఆర్‌డీఏ అధికారులు స్పందించి, విచారణ చేపట్టారు. రెండు రోజులుగా జరుగుతున్న విచారణలో శుక్రవారం వరకు జరిగిన రికార్డు పరిశీలన ద్వారా రూ.58 లక్షల వరకు స్కామ్ జరిగినట్టుగా అధికారులు గుర్తించారు. బ్యాంకు పరిధిలోని మరి కొన్ని గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలు, రైతుల చెల్లింపులను కూడా పరిశీలించవలసి ఉంది. ఈ నేపథ్యంలో ఈ స్కామ్ రూ.80 లక్షలు దాటే అవకాశం ఉందని వారు భావిస్తున్నారు.

రెండేళ్లుగా ఇదే తంతు..

బ్యాంకులో రికార్డుల పరిశీలన జరుగుతున్న నేపథ్యంలో తమకు పూర్తి న్యాయం చేయాలని, నానిబాబు స్వాహా చేసిన సొమ్మును తిరిగి తమ అకౌంట్లలో జమ చేయాలని కోరుతూ బ్యాంకు ముంగిట డ్వాక్రా మహిళలు, రైతుల ఆందోళనకు దిగారు. ఈ బాధితులలో జి.యర్రంపాలెం వారి కంటే పుణ్యక్షేత్రం వారే ఎక్కువ మంది ఉన్నారు. కాగా బీసీ నానిబాబు చేతివాటం చూపడం ఈ మధ్య జరిగింది కాదని, గత రెండేళ్లుగా జరుగుతూనే ఉందని ఆరోపించారు. తమ నుంచి నగదు తీసుకోవడం, బ్యాంకు కూపను పై బ్యాంకు స్టాంప్ వేసి, ఇనీషియల్ చేసి, రశీదు ఇచ్చేవాడని, పాస్‌బుక్‌లో పోస్టింగ్ వేయమంటే మెషీను పని చేయడం లేదని, బిజీగా ఉందని, నెట్‌వర్కు బాగోలేదంటూ ఏవేవో కుంటిసాకులు చెప్పేవాడన్నారు. ఈ సమయంలో కూడా బ్యాంకు సిబ్బంది ఎవ్వరూ పట్టించుకునే వారు కాదన్నారు.

డీఆర్‌డీఏ అధికారుల పరిశీలనలో వెల్లడైన స్కామ్ వివరాలు

కొండగుంటూరు, సంపత్‌నగరంలోని 17 మహిళ సంఘాల నుంచి రూ. 6.17 లక్షలు, పుణ్యక్షేత్రంలోని 16 మహిళ సంఘాల నుంచి 27.10 లక్షలు, జి.యర్రంపాలెంలో 14 మహిళ సంఘాల నుంచి 12.20 లక్షలు, ఇంకా 17 మహిళా సంఘాలు చేసిన చెల్లింపులను పరిశీలించవలసి ఉంది. ప్రస్తుతం డీఆర్‌డీఏ అధికారులు ఆ పనిలో ఉన్నారు. రైతులు చెల్లించిన గోల్డ్‌లోన్, క్రాప్ లోన్‌లకు సంబంధించి రూ.19,87,400 అవినీతి జరిగింది. ఇంతవరకు జరిగిన రికార్డుల పరిశీలన ద్వారా రూ. 57,77,900 స్కామ్ జరిగినట్టుగా వెల్లడైంది.

అండగా ఉంటా : ఎమ్మెల్యే

మహిళలు, రైతులు చేస్తున్న ఆందోళన గురించి తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఘటనా స్థలానికి చేరుకుని, ఆందోళనకారులకు మద్దతు పలికారు. పూర్తి న్యాయం జరిగే వరకు మీకు అండగా ఉంటానంటూ భరోసానిచ్చారు. బ్యాంకు అధికారులు 45 రోజులు గడువు కోరారని, ఆలోగా మీకు న్యాయం జరగకపోతే మీతోపాటు ఆందోళన చేయడమే కాకుండా ఈ విషయాన్ని ఉప ముఖ్యమంత్రి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానన్నారు.



బ్యాంక్ ఆఫ్ బరోడా వద్ద ఆందోళన చేస్తున్న మహిళలు, రైతులు

జంతు ప్రేమికా.. జాగ్రత్త సుమా!

- మూగజీవాల పెంపకం మాటున ప్రమాదం
- వ్యాధులపై అప్రమత్తత అవసరం
- నేడు ప్రపంచ జూనోసిస్ డే

రాజమహేంద్రవరం రూరల్ : మూగజీవాల పెంపకంపై ఎంతో మంది శ్రద్ధ చూపుతున్నారు. అందుకే ప్రస్తుతం అవి మానవ జీవితంతో ముడిపడ్డాయి.. నిన్న మొన్నటి వరకూ సరదాకు, ఇంటి కాపలాకు పరిమితమైన కుక్కల పెంపకం ప్రస్తుతం స్టేటస్ సింబల్‌గా మారింది. అలాగే గుర్రాలు, కుందేళ్లు, పిల్లులతో పాటు ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోతులు వంటి వాటినీ పెంచుకుంటున్నారు. ఎంతో ఇష్టంగా సాకుతున్న జంతువుల నుంచి మనుషులకు వ్యాధులు సంక్రమించే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు. పరిశోధనల ప్రకారం జంతువుల నుంచి మనుషులకు, మనుషుల నుంచి జంతువులకు 190 రకాల వ్యాధులు సోకే అవకాశం ఉంది. శనివారం ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా వాటి గురించి తెలుసుకుందాం రండి.

ఆ పేరు ఎలా వచ్చిందంటే..

పశువుల నుంచి మనుషులకు వచ్చే వ్యాధుల్లో రేబిస్ అత్యంత ప్రమాదకరమైంది. పిచ్చికుక్క కరిచిన ఓ బాలుడికి 1885 జూలై 6న లూయీ పాశ్చర్ అనే శాస్త్రవేత్త మొదటి సారిగా వ్యాధి నిరోధక టీకా ఇచ్చారు. ఇది విజయవంతమై అత్యంత ప్రాచుర్యం పొందింది. ఈ రేబిస్ టీకాను జూలై 6న కనిపెట్టడం వల్ల ప్రతి ఏటా ప్రపంచ జూనోసిస్ దినోత్సవం జరుపుకొంటున్నారు.



బొమ్మూరులో పెంపుడు కుక్కలతో యజమాని సునీత

శుభ్రత.. భద్రత

ముఖ్యంగా పిల్లులు, కుక్కలు వంటి పెంపుడు జంతువులు, పక్షులను పెంచుకోవడం బాగా పెరిగింది. పెంపుడు జంతువులతో ఆటలాడిన తర్వాత శుభ్రత పాటించకుంటే వ్యాధులకు గురవుతుంటారు. జంతువులను పెంచుకునే వారు తగిన జాగ్రత్తలు పాటించకుంటే వాటి నుంచి వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ఇందులో రేబిస్, ఆంత్రాక్స్ వంటివి భయాందోళనకు గురిచేస్తున్నాయి. అందువల్ల తమ పెంపుడు కుక్కలు బయట తిరిగే సమయంలో ఇతరులపై దాడి చేయకుండా యజమానులూ జాగ్రత్త పడాలి.

వ్యాక్సిన్ తప్పనిసరి

పెంపుడు జంతువులకు వేసే వ్యాక్సినేషన్‌పై చాలా మందికి అవగాహన ఉండదు. కొందరు ఖర్చుతో కూడినదని పట్టించుకోరు. కుక్కలకు మామూలుగా కరిచే గుణం ఉంటుంది. కాబట్టి వ్యాక్సినేషన్ తప్పనిసరి. మనిషి, జంతువుకు ఉండే కాంటాక్ట్‌లో అది కరవడం, గీరడం వంటివి సాధారణంగా జరుగుతుంటాయి. దానివల్ల ఏదైనా ఆరోగ్య సమస్య రావచ్చు. కుక్కలు, పిల్లులు పెంచుతున్న వారు కూడా వ్యాక్సినేషన్ అవసరాన్ని గుర్తించాలి.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

తూర్పుగోదావరి జిల్లాలో వీధికుక్కలు 1,15,771, పెంపుడు కుక్కలు 26,562, ఆవులు 74,778, గేదెలు 1,93,847, గొర్రెలు 1,71,263, మేకలు 69,265, పందులు 2,080 ఉన్నాయి. కోనసీమ జిల్లాలో మొత్తం పెంపుడు జంతువులు 63,953 ఉన్నాయి. ఇందులో కుక్కలు 22,570 ఉండగా, పిల్లులు, గుర్రాలు, కుందేళ్లు, పక్షులు, ఇతర పెంపుడు జంతువులు 41,383 ఉన్నాయి. కాకినాడ జిల్లాలో పశువైద్య శాలలు, ప్రాంతీయ, వెటర్నటీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లలో జూనోటిక్ వ్యాధుల నివారణకు శనివారం ఉచితంగా టీకాలు వేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మొత్తం జిల్లాకు 32 వేల యాంటీ రేబిస్ టీకాలు సిద్ధం చేశారు.

ఏ వ్యాధులు వస్తాయంటే..

పాడి పశువుల నుంచి ఆంత్రాక్స్, బ్రూసిల్లోసిస్, లిస్టిరియోసిస్, రింగ్‌వార్మ్ వ్యాధులు వస్తాయి. గొర్రెలు, మేకల నుంచి ఆంత్రాక్స్, బ్రూసిల్లోసిస్, లిస్టిరియా, హైడాటిడోసిస్, సార్కోసిస్టిస్, సాల్మోనెల్లోసిస్, క్యూ-ఫీవర్, మేంజ్ వ్యాధులు సంక్రమిస్తాయి. కుక్కల నుంచి రేబిస్, లీష్మేనియా, బద్దెపురుగుల వ్యాధి, రింగ్ వార్మ్, హైడాటిడోసిస్, మీసిల్స్, మంప్స్, మేంజ్ వ్యాధులు వస్తాయి. అలాగే పందులు, పిల్లులు, గుర్రాలు, కోళ్లు రామచిలుకలు, కుందేళ్ల నుంచీ వివిధ వ్యాధులు సోకుతాయి.

వైద్యుల సలహాలు తప్పనిసరి



జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులను జునాటిక్ డిసీజస్ అంటారు. ఇవి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే క్రమం తప్పకుండా పశు వైద్యుల సలహాలు తీసుకోవాలి. సరైన వ్యాక్సిన్ వేయకుండా పెంపుడు జంతువులు, కుక్కలతో సన్నిహితంగా ఉండొద్దు. జూనోసిస్ డే సందర్భంగా శనివారం రాజమహేంద్రవరం ఏరియా పశు వైద్యశాలలో పెంపుడు జంతువులకు, వాటి యజమానులకు, పశుసంవర్ధక శాఖ సిబ్బందికి, మున్సిపల్ వర్కర్లకు, జంతువధ శాఖ సిబ్బందికి, జంతు ప్రేమికులకు ఉచితంగా యాంటీ రాబిస్ టీకాలు వేస్తాం.

-టి.శ్రీనివాసరావు, జిల్లా పశు వైద్యాధికారి, తూర్పుగోదావరి





రేబిస్ ఇంజెక్షన్

అప్పుడే.. మీ సొమ్ము భద్రం

- ప్రైవేట్ వ్యక్తుల వలకు చిక్కొద్దు
- ప్రభుత్వ రంగ సంస్థల్లో పొదుపే సురక్షితం



కొత్తపేట: ఒక చిరు వ్యాపారి ఊరూరా తిరిగి వ్యాపారం చేస్తూ, కూతురు పెళ్లి కోసం రూపాయి రూపాయి కూడబెట్టాడు.. కనీసం చిన్న ఉద్యోగం చేసే మంచి కుర్రాడితో సంబంధం కుదిరితే తన స్థాయిలో కట్న కానుకలు ఇచ్చి పెళ్లి చేద్దామని భావించాడు. ఈలోపు అతనితో పరిచయమున్న ఓ వడ్డీ వ్యాపారి తారసపడి డబ్బు ఇంట్లో పెట్టుకుంటే ఏమొస్తుంది.. నేను వడ్డీకి ఇస్తాను. పెళ్లి నాటికి డబ్బు పెరుగుతుందని ఆశ చూపాడు. అది నమ్మి ఆ వ్యాపారి డబ్బు ఇచ్చాడు. తీరా పెళ్లి కుదిరాక డబ్బు ఇమ్మంటే ఆ వడ్డీ వ్యాపారి ముఖం చాటేశాడు.

- ఒక రైతు కుటుంబం రెండు పాడి గేదెలను మేపుతూ, పాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తోంది. కుటుంబ అవసరాలకు సరిపడా ఉంచుకుని మిగిలిన డబ్బు చిట్టీ కట్టింది. చిట్టీ కట్టుబడి పూర్తయ్యాక మొత్తం నగదు కోసం వెళితే సదరు వ్యక్తి బోర్డు తిప్పేశారు. దీంతో ఆ కుటుంబం లబోదిబోమంది.
- ఓ చిరుద్యోగి.. రిటైర్‌మెంట్ అయ్యాక వచ్చిన డబ్బు శేష జీవితంలో ఉపయోగపడుతుందని, ఏదైనా బ్యాంకులో డిపాజిట్ చేద్దామనుకుంటున్నాడు. ఓ రోజు అతనితో కలసి వాకింగ్ చేసే ఇంటి పక్క వ్యక్తిని ఏ బ్యాంకులో వడ్డీ బాగా వస్తుందని సలహా అడిగాడు. వివిధ బ్యాంకుల గురించి చెబుతూ బాబాయ్ గారు.. నా వ్యాపారంలో డబ్బు పెట్టండి బ్యాంకు వడ్డీకంటే మూడు, నాలుగు రెట్లు అధికంగా ఆదాయం వస్తుందని నమ్మించాడు. మంచివాడే కదా అని ఇస్తే ఆ డబ్బుతో ఉడాయించాడు. ఇలా ఎంతోమంది మోసపోతున్నారు.

రూపాయి.. రూపాయి కూడబెడితే భవిష్యత్తుకు సమృద్ధి నిల్వ ఉంటోంది. కానీ కొంతమంది పైవిధంగా మోసగాళ్ల వలలో పడి, మరికొందరు త్వరగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో కేటుగాళ్ల ఉచ్చులో చిక్కుకుని ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు. అందుకే పొదుపు అనేది ప్రభుత్వ రంగ సంస్థల్లో చేయడమే ఉత్తమం. పొదుపు చేయడానికి అనేక మార్గాలున్నాయి. అయితే ప్రభుత్వ సంస్థలే దీనికి రక్షణ కవచంలా నిలబడతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ప్రస్తుత సమాజంలో ఎన్నో ఆర్థిక మోసాలు, నేరాలు జరుగుతున్నాయి. ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలు అధిక వడ్డీల ఆశ చూపడంతో ఎంతో మంది అప్పులు ఇవ్వటం, పొదుపు చేయటంతో నిలువునా మోసపోతున్న ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఆ అప్పులు రాబట్టుకోవడానికి కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అందుకే సొమ్మును ప్రభుత్వ సంస్థల్లో దాచుకోవడమే మేలని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు.

సేవింగ్స్ డిపాజిట్లు

ఖాతాదారుల సౌకర్యార్థం వివిధ బ్యాంకులు ట్యాక్స్ సేవింగ్ డిపాజిట్లను అందుబాటులోకి తీసుకువచ్చాయి. ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్ వంటి జాతీయ, ప్రైవేట్ బ్యాంకులతో పాటు పోస్టాఫీసుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్ పథకాలు ఉన్నాయి. ఫిక్స్‌డ్ డిపాజిట్లలో రెండు రకాలున్నాయి. ఇందులో టర్మ్ డిపాజిట్‌పై వడ్డీ ప్రతి ఆరు నెలలకు ఒకసారి జమ అవుతుంది. స్పెషల్ డిపాజిట్.. టర్మ్ డిపాజిట్‌లపై వచ్చే వడ్డీ అదే డిపాజిట్‌లోని ఖాతాకు జమ అవుతుంది. అందువల్ల ఖాతాదారునికి వడ్డీ మీద వడ్డీ వస్తుంది.

పోస్టల్‌లో ప్రత్యేక డిపాజిట్ పథకాలు



పోస్టల్ శాఖలో పిల్లల నుంచి వయో వృద్ధుల వరకూ ప్రయోజనకరమైన ప్రత్యేక డిపాజిట్ పథకాలు ఉన్నాయి. ప్రధానంగా సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్ కింద, సుకన్య సమృద్ధి యోజన అక్కౌంట్ కింద 8.2 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ 7.7 శాతం, కిసాన్ వికాస్ పత్ర, మహిళ సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్స్‌కు, 5 సంవత్సరాల డిపాజిట్స్‌కు 7.5 శాతం, మంత్లీ ఇన్‌కం స్కీమ్‌కు 7.4 శాతం, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌కు 7.1 శాతం, 1, 2, 3 సంవత్సరాల డిపాజిట్స్‌కు 6.9 నుంచి 7.1 శాతం వడ్డీ చెల్లిస్తున్నాం.

– కె.విఠల్‌నాథ్, సబ్ పోస్ట్‌మాస్టర్, కొత్తపేట

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఇలా..

హెడ్ పోస్టాఫీసులు	6
సబ్ పోస్టాఫీసులు	150
బ్రాంచ్ పోస్టాఫీసులు	662
ప్రభుత్వ, ప్రైవేట్, రీజనల్ రూరల్, కో ఆపరేటివ్, స్మాల్ ఫైనాన్స్‌రంగ బ్యాంక్‌ల బ్రాంచ్‌లు	989

దీర్ఘకాలిక ప్రయోజనాలు



అవసరాలకు డబ్బు కావాలనుకునే వారు అధిక వడ్డీల కోసం ఆశ పడకుండా ప్రభుత్వ సంస్థల్లో పొదుపు చేసుకోవడం మంచిది. యూనియన్ బ్యాంకులో ఆర్‌డీ సదుపాయం ఉంది. 6.5 నుంచి 7 శాతం వడ్డీ ఇస్తున్నాం. ఫిక్స్‌డ్ డిపాజిట్లకు 399 రోజులకు 7.25 శాతం వడ్డీ చెల్లిస్తారు. 60 ఏళ్లు దాటిన సీనియర్ సిటిజన్స్‌కు 7.75 శాతం, 80 ఏళ్లు పైబడితే 8 శాతం వడ్డీ చెల్లిస్తారు. మిలియనీర్ డిపాజిట్ పథకం కింద అత్యధిక వడ్డీ రేటుతో రూ.10 లక్షల స్పెషల్ రికరింగ్ డిపాజిట్ పొదుపు పథకం ప్రవేశపెట్టారు.

– ఎన్‌కే విశ్వనాథ్, యూనియన్ బ్యాంక్ బీఎం, కొత్తపేట

సీనియర్ సిటిజన్స్‌కు ఎక్కువ వడ్డీ

కొంత మొత్తం నిర్ణీత కాలానికి పొదుపు చేయడాన్ని ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ) అంటారు. ఎఫ్‌డీ సొమ్మును బ్యాంకుల్లో ఏడు రోజుల నుంచి గరిష్ఠంగా పదేళ్ల వరకూ దాచుకునే వీలుంది. సీనియర్ సిటిజన్స్‌కు 0.50 నుంచి 0.75 శాతం ఎక్కువ వడ్డీ చెల్లిస్తారు. ఫిక్స్‌డ్ డిపాజిట్లను పిల్లల పేరుపై కూడా ఐదేళ్లు, అంతకంటే ఎక్కువ కాలం చేసుకునే అవకాశం ఉంది.

రికరింగ్ డిపాజిట్లు

బ్యాంకులు, పోస్టాఫీసుల్లో రికరింగ్ డిపాజిట్లు (ఆర్‌డీ) అక్కౌంట్‌లను ఏర్పాటు చేసుకునే వీలుంది. నెల నెలా కొంత మొత్తం పొదుపు చేసుకుని దానిపై వడ్డీ పొందవచ్చు. నెలకు గరిష్ఠంగా కొంత సొమ్మును నిర్ణీత కాలం వరకూ జమ చేయాల్సి ఉంటుంది. కాలపరిమితి ముగిసిన తరువాత ఆర్‌డీ సొమ్మును వడ్డీతో సహా బ్యాంకులు, పోస్టాఫీసులు ఖాతాదారులకు చెల్లిస్తాయి. కనీసం రూ.100 నుంచి ఆర్‌డీ చేసుకునే అవకాశం ఉంది. పదేళ్ల వరకూ ఆర్‌డీలు చేసుకోవచ్చు. ఇందులో కూడా సీనియర్ సిటిజన్స్‌కు కొంత అదనపు వడ్డీ లభిస్తుంది.

క్లుప్తంగా

పనసా.. దీని బరువెంతో తెలుసా!



అబ్బురపరుస్తున్న పనస కాయలు

కొత్తపల్లి: ఆ పనసకాయలు అబ్బుర పరుస్తున్నాయి.. అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయి. పిఠాపురం పట్టణంలో సురేష్ ఇంటి వద్ద ఓ పనస చెట్టు విరగకాసింది. చెట్టు మొదలు నుంచి చివరి వరకూ గుత్తులు గుత్తులుగా కాయలు కాశాయి. ఇందులో రెండు పనస కాయలు అబ్బుర పరుస్తున్నాయి. మూడు అడుగుల ఎత్తులో ఒక్కో పనస పండు సుమారు 75 కిలోల బరువు ఉండడం విశేషం. సాధారణంగా పది నుంచి 30 కిలోల వరకూ బరువుంటాయని వ్యాపారులు చెబుతున్నారు. ఈ పనస ఒక్కొక్కటి రూ.1,500కు విక్రయించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక ప్రధాన రైల్వే స్టేషన్‌లోని ఆరో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై సుమారు 35 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్‌ఐ మావుళ్లు శుక్రవారం తెలిపారు. ఆ మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. మృతుని శరీరంపై నలుపు, తెలుపు రంగు చారల షర్ట్ ఉంది. కుడి చేతిపై లవ్ సింబల్‌లో ఆర్ అనే పేరుతో పచ్చబొట్టు ఉందని, వివరాలు తెలిసిన వారు 94406 27551, 94914 44022 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని ఎస్సై కోరారు.

ఉద్యోగిపై దాడి

మండపేట: మండపేటలో గురువారం రాత్రి ఓ మున్సిపల్ ఉద్యోగిపై మందు బాబులు దాడి చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. గొల్లపుంత రోడ్డులో వున్న టిడ్కో కాలనీలో వాటర్ ట్యాంకు వద్ద మున్సిపల్ కార్యాలయ ఉద్యోగి మోటుపల్లి వెంకటేశ్వరరావు గురువారం రాత్రి విధుల్లో ఉన్నారు. ఈ లోగా కాలనీలోని కొంత మంది యువకులు ట్యాంకు వద్ద పార్క్ చేసిన వెంకటేశ్వరరావు సైకిల్‌ను ఢీకొని, గొడవకు దిగి దాడి చేశారు. ఆ రోజు రాత్రే వెంకటేశ్వరరావు పోలీస్ స్టేషన్‌లో చేశారు.

వెల్లలో అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామకృష్ణ

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలం వెల్ల గ్రామంలో గురువారం రాత్రి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. డీఎస్పీ బి.రామకృష్ణ కథనం ప్రకారం.. వెల్ల గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పనుల్లో భాగంగా జగనన్న కాలనీకి వెళ్లిన సచివాలయ సిబ్బంది అక్కడ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహంతో పాటు ఉండాల్సిన అంబేడ్కర్ విగ్రహం లేకపోవడం గమనించారు. ఆ విగ్రహం పక్కనే శిథిలమై ఉండటం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ దొరరాజు, ఎస్సైలు జి.సురేంద్ర, బి.సురేష్‌బాబు, జానీబాషా, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో సున్నితమైన అంశం కావడంతో డ్యాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను పంపించామని డీఎస్పీ తెలిపారు. దోషులు ఎవరైనా పట్టుకుని కఠిన శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

సంఘటనా స్థలం పరిశీలన

ఈ విషయం తెలుసుకున్న పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాలు, దళిత సంఘాల నాయకులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు, ఎంపీపీ అంబటి భవాని, వైఎస్సార్ సీపీ నాయకులు పంతగడ విజయప్రసాద్, పోలినాటి వరప్రసాద్, పెట్లా శ్రీనివాసరావు, అంబటి తుకారం, సాదే రాజేష్, ప్రజా సంఘాల నాయకులు బి.సిద్ధూ, గుబ్బల శ్రీను, రావ్వా భూషణం, ఆనందరావు, వినయ్ తదితరులు సంఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. దోషులను త్వరగా పట్టుకుని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.

రూ.90 నాణెం సేకరణ



నాణేనికి ఓ వైపు రూ.90 ముఖ విలువ



మరోవైపు భారతీయ రిజర్వు బ్యాంక్ చిహ్నం

అమలాపురం టౌన్: భారతీయ రిజర్వు బ్యాంక్ ఏర్పడి తొమ్మిది దశాబ్దాలు పూర్తయిన సందర్భంగా కోల్‌కతా టంకశాల తొలిసారిగా ముద్రించి విడుదల చేసిన రూ.90 నాణేన్ని అమలాపురానికి చెందిన నాణేల సేకరణ కర్త పుత్సా కృష్ణ కామేశ్వర్ ప్రత్యేక ఆర్డర్‌పై సేకరించారు. ఈ నాణెం 40 గ్రాముల బరువు ఉండి పూర్తిగా వెండితో తయారు చేశారు. నాణేనికి ఒకవైపు రూ.90 ముఖ విలువ, మరోవైపు భారతీయ రిజర్వు బ్యాంక్ చిహ్నాన్ని ముద్రించారు. 1935లో ఏర్పడిన రిజర్వు బ్యాంక్ నాటి నుంచి నేటి వరకూ భారత ఆర్థిక వ్యవస్థలో కీలకపాత్ర పోషించినందుకు గుర్తుగా ఈ నాణేన్ని ముద్రించారు.

విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో దాడులు



అమలాపురంలోని ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం, అల్లవరం మండలంలోని పలు విత్తనాలు, ఎరువులు, పురుగుల మందుల దుకాణాల్లో వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల బృందం శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఆయా దుకాణాల లైసెన్స్‌లు, రికార్డులు, స్టాకులు పరిశీలించింది. శ్రీకాకుళం జిల్లా పలాస సహాయ వ్యవసాయ సంచాలకులు ఎల్‌వీ మధు, విజిలెన్స్ సీఐ శ్రీలక్ష్మాజీతో కూడిన బృందం ఈ తనిఖీలు చేసింది. కొన్ని దుకాణాల్లో రికార్డులు, స్టాకులు సక్రమంగా లేక రూ. 94 వేల విలువైన 41.150 లీటర్ల పురుగు మందుల విక్రయాలను బృందం నిలిపివేసింది. అమలాపురం, అల్లవరంలో అనంతలక్ష్మి సీడ్స్ అండ్ జనరల్ మర్చంట్స్, రామలక్ష్మి ఏజెన్సీస్, అల్లవరం మండలంలో శ్రీదుర్గాదేవి ఏజెన్సీ దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో అమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు ఎంఏ షంషీ, అమలాపురం, అల్లవరం మండలాల వ్యవసాయాధికారులు కె.ధర్మప్రసాద్, ఎస్‌వీ సత్యనారాయణ పాల్గొన్నారు. అనంతరం ముమ్మిడివరం మండలంలో తనిఖీలు చేపట్టారు.

హుండీల ఆదాయం లెక్కింపు



అంతర్వేది దేవస్థానంలో హుండీల ఆదాయం లెక్కిస్తున్న అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో హుండీల ద్వారా మొత్తం ఆదాయం రూ.46,11,212 సమకూరింది. శుక్రవారం దేవస్థానం కార్యాలయం వద్ద కోనసీమ జిల్లా ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్ నాగమల్లేశ్వరరావు సమక్షంలో మార్చి 26వ తేదీ నుంచి ఈ నెల 5వ తేదీ వరకూ గాను ఈ లెక్కింపు నిర్వహించారు. పై మొత్తంలో మెయిన్ హుండీల ద్వారా రూ.44,74,752, గుర్రాలక్క అమ్మవారి హుండీ ద్వారా రూ.26,572, అన్నదానం హుండీల ద్వారా రూ.1.09,888 ఆదాయం సమకూరినట్టు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. అలాగే పలు విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయన్నారు. కాగా దేవస్థానానికి అనుబంధంగా ఉన్న నీలకంఠేశ్వరస్వామివారి హుండీ ద్వారా రూ.19,452 ఆదాయం సమకూరిందన్నారు. ఎండోమెంట్స్ అధికారి బి.వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ భైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, స్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతిపై దాడి



గోకవరంలో యువతిపై దాడి చేసిన సూరిబాబు

గోకవరం: గోకవరంలో మతిస్థిమితం లేని మహిళపై ఓ యువకుడు దాడి చేసి బ్లేడుతో తీవ్రంగా గాయపరిచాడు. ఈ విషయం గుర్తించిన స్థానికులు అతనికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించగా, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ వివరాల ప్రకారం.. గోకవరం అరవపేటలో నివాసం ఉంటున్న ఎడ్ల సూరిబాబు మత్తు పదార్థాలకు అలవాటు పడి కొంతకాలంగా ఆ మార్గంలో వెళుతున్న వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం సమయంలో మతిస్థిమితం లేని మహిళపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించడంతో తన వద్ద ఉన్న బ్లేడుతో ఆ యువతిపై దాడికి తెగబడ్డాడు. ఈ దాడిలో యువతి చేతిపై, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. ఆమె కేకలు విన్న స్థానికులు వెంటనే ఆ యువకుడిని బంధించి దేహశుద్ధి చేసి విద్యుత్ స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై కె.నాగరాజు సిబ్బందితో అక్కడికి చేరుకుని దాడికి పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అలాగే తీవ్రంగా గాయపడిన మహిళని చికిత్స నిమిత్తం గోకవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్‌లో చిక్కుకుని యువకుడి దుర్మరణం



కాపవరంలో ట్రాక్టర్‌లో ఇరుక్కుని మృతి చెందిన తరుణ్‌కుమార్ (అంతరచిత్రం)

రామచంద్రపురం రూరల్: దమ్ము ట్రాక్టర్‌లో చిక్కుకుని ఓ యువకుడు దుర్మరణం పాలైన ఘటన కాపవరంలో చోటుచేసుకుంది. ద్రాక్షారామ పోలీసుల కథనం ప్రకారం.. కాపవరం గ్రామానికి చెందిన సిద్దాల తరుణ్‌కుమార్ (24) శుక్రవారం వరి పొలంలో చిన్న ట్రాక్టరుతో దమ్ము చేస్తూ ప్రమాదవశాత్తూ ట్రాక్టర్‌లో చిక్కుకుని మృతి చెందాడు. గతంలో ఇతను వలంటీర్‌గా పనిచేశాడు. అతని తండ్రి చిన్నతనంలోనే మృతి చెందడంతో తల్లి సిద్దాల వీరగనికమ్మ తరుణ్‌కుమార్, అతని చెల్లెలిని అమ్మమ్మ, తాతయ్యలు కొల్లపు మంగమ్మ, నారాయణమూర్తిలకు అప్పగించి దుబాయ్‌లో పనికి వెళ్లింది. వలంటీర్‌గా తరుణ్ చాలా చురుగ్గా ఉండేవాడు. అప్పగించిన ప్రతి సర్వే వెంటనే పూర్తి చేసి మంచి పేరు తెచ్చుకున్నాడు. గత సంవత్సరం వలంటీర్‌గా మానేసి హైదరాబాద్ వెళ్లాడు. అమ్మమ్మ, తాతయ్యల కోరికపై మళ్లీ సొంతూరుకి వచ్చేశాడు. అతని ఆకస్మిక మృతికి సర్పంచ్ యనమదల మంగాదేవి, ఎంపీటీసీ రెడ్నం సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు కొల్లపు రాంబాబు, గీసాల శివ తదితరులు సంతాపం తెలిపారు. ఎప్పుడూ హుషారుగా ఉండే తరుణ్‌కుమార్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

శ్రీచైతన్యలో గ్రీన్ ఇండియా మిషన్



శ్రీచైతన్య స్కూల్‌లో మొక్కలు నాటే కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక సీతంపేటలో ఉన్న శ్రీచైతన్య పాఠశాలలో స్మార్ట్ లివింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా జీమ్ (గ్రీన్ ఇండియా మిషన్) కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఇందులో భాగంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు మొక్కలు నాటారు. అనంతరం చెట్ల పెంపకం ప్రాధాన్యాన్ని వివరిస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పి.మహేశ్వరరావు మాట్లాడుతూ మొక్కలు లేకపోతే మనిషి మనుగడ లేదన్నారు. మొక్కల పెంపకంతోనే పర్యావరణ సమతుల్యత సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం ఎంవీ సురేష్, రీజినల్ ఇన్‌చార్జి ఉదయ్‌శంకర్, డీన్ సాయికిరణ్, కుసుమ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేగంగా అదృశ్యం కేసుల పరిష్కారం



జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న ఎస్పీ జగదీష్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లాలో మహిళల అదృశ్యం కేసులపై దృష్టి సారిస్తున్నామని, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి త్వరలోనే వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ పి.జగదీష్ తెలిపారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ కేసులపై అన్ని పోలీస్ స్టేషన్‌లలోని ఎస్‌హెచ్‌వోలు, జోనల్ డీఎస్పీలతో శుక్రవారం జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిస్సింగ్ కేసులపై సరైన రీతిలో స్పందించాలన్నారు. దర్యాప్తులో ఎటువంటి జాప్యం చేయరాదన్నారు. మహిళల మిస్సింగ్ కేసులలో కారణాలు గుర్తించడంలో ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. పోలీస్ స్టేషన్లలో వుమెన్ హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో ప్రజలు కూడా తమ వంతు సహాయ సహకారాలు పోలీసులకు అందించాలని, ఎవరైనా అనుమానంగా కనిపిస్తే దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్‌కు, డయల్ 112కు తెలియజేయాలన్నారు.

ఎస్పీ జగదీష్

పెట్రోల్ పోయించుకుని బురిడీ

ఓ ఆగంతకుడి నిర్వాకం



సీసీ కెమెరాలో నమోదైన నిందితుడి చిత్రం

నల్లజర్ల: నల్లజర్ల జంక్షన్‌లోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సిబ్బందికి ఓ ఆగంతకుడు మాయమాటలు చెప్పి రూ.16 వేలు కాజేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. గురువారం రాత్రి అచ్చన్నపాలేనికి చెందిన రైతు భరత్ ట్రాక్టర్‌పై వెళుతుండగా, ఓ ఆగంతకుడు అతనిని పిలిచి తనకు జేసీబీలు, పొక్లెయినర్లు ఉన్నాయని తెలిపాడు. ఆయిల్‌కు సంబంధించి బిల్లులు పెట్టుకోవాలని, లీటర్ డీజిల్ రూ.80కే ఇప్పిస్తానని నమ్మబలికి బంక్‌కు తీసుకువచ్చాడు. ఆ రైతు ట్రాక్టర్‌పై ఉన్న ఆయిల్ పీపాలో 200 లీటర్ల డీజిల్ కొట్టించాడు. ఈ నేపథ్యంలో రైతు వద్ద రూ.16 వేలు తీసుకొని ఆ ఆగంతకుడు ట్రాక్టర్‌ను వెళ్లిపొమ్మన్నాడు. బంక్ సిబ్బంది డబ్బులు అడిగితే పక్కనే మరో రెండు టిన్నులు ఉన్నాయి. మొత్తం కలిపి ఒకేసారి ఇస్తానని చెప్పి చీకట్లో కలిసిపోయాడు. అతని రాక కోసం సిబ్బంది చాలాసేపు ఎదురుచూశారు. చివరకు మోసపోయామని యజమానికి చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరాలో ఆగంతకుడి చిత్రం నమోదైంది. ఇదే మాదిరిగానే వారం కిందట భారత్ పెట్రోల్ బంక్ వద్ద లారీలో 212 లీటర్ల డీజిల్ కొట్టించుకొని మరో వ్యక్తి స్టేట్ బ్యాంకు ఏటీఎం కార్డు ఇచ్చాడు. సిబ్బంది ఆ కార్డు మెషీన్‌లో పెట్టేలోగా లారీ స్పీడ్‌గా వెళ్లిపోయింది. ఆ ఏటీఎం కార్డు డూప్లికేట్ కార్డు. ఇలా రూ.20,663 బంక్ వారు నష్టపోవాల్సి వచ్చింది. వీరూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆభరణాల చోరీ



ఆలయంలో సీసీ కెమెరాలో చిక్కిన నిందితుడి చిత్రం



జి.మామిడాడ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహిళా పోలీసులతో మాట్లాడుతున్న సీఐ సన్యాసిరావు

పెదపూడి: జి.మామిడాడ గ్రామ శివారు సూర్యనారాయణపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. సుమారు 20 కిలోల వెండి ఆభరణాలు అపహరించాడు. సంఘటనా స్థలాన్ని కాకినాడ రూరల్ సీఐ సన్యాసిరావు, క్రైమ్ సీఐ చిట్టిబాబు, ఎస్సై శోభన్‌కుమార్, క్లూస్ టీమ్ పరిశీలించారు. ఎస్సై శోభన్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని గురువారం రాత్రి అర్చకుడు రఘురామాచార్యులు మూసివేశారు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించి గునపం, ఇతర ఇనుప వస్తువులతో ఆలయ ప్రవేశ గేటు, స్వామివారి గర్భగుడి తాళాలు పగులగొట్టి లోపలకు ప్రవేశించాడు. సుమారు 20 కిలోల స్వామి, అమ్మవార్ల వెండి ఆభరణాలు అపహరించుకుపోయాడు. ఇందులో వెండి కవచాలు, హుండీ, ఉత్సవ విగ్రహాల మంగళసూత్రాలు తదితరాలు ఉన్నాయి. ఆలయంలోని సీసీ కెమెరాను పోలీసులు పరిశీలించగా, నిందితుడి తలకు మంకీ క్యాప్ ధరించి, నీలం రంగు జర్కిన్ వేసుకుని, చేతికి గ్లౌజ్‌లు, నిక్కరు లాంటి అండర్‌వేర్ ధరించి ఉన్నట్లు గుర్తించారు. ఈ మేరకు ఆలయ అర్చకుడు రఘురామాచార్యులు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి సీఐ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు.